15

# విచిత్ర వివాహం

నా అంతట నేను మా అబ్బాయి కటువంటి పెళ్ళి చేసి ఉండను. ఆ పెటకం మా రామమూర్తే పెట్టాడు. వాడు తప్ప మరెవ్వడు చెప్పినా అటువంటి ఆలోచనను అంగీకరించి వుండేవాణ్ని కాను కూడాను.

ఈ ఉత్తరం తిలకించండి.

'నాగపూరు, 5 జూలై 1924.

'ప్రియ మిత్రమా, [ఉత్తరం ఇంగ్లీషులో] శివ తేదీన నువ్వు రాసిన ఉత్తరం నన్ను చాలా ఆందోళన పెట్టింది. మీ అబ్బాయి పెళ్ళి విషయం ఆలోచిస్తున్నా నన్న■డవు మా అమ్మాయి విషయం ఎందుకు అడిగావు కావు! నేను నిన్నిందుకు క్షమించను - ఒక షరతుమీాద తప్ప. అదేమిటంటే నువ్వు మీ అబ్బాయికీ మా అమ్మాయికీ వివాహం చెయ్యాలి. అదికూడా నేను చెప్ప తీరుగా. మా పెద్దదాని పెళ్ళితో నాకు పెళ్ళంటే హడలెత్తిపోయింది. నీకు కూడా అటువంటి భయమే కలిగిఉండేది నా పెద్ద పిల్లమీాద నీకు తగినంత కటాక్షం ఉండివుంటే.

'మనిద్దరికీ భగవంతుడు కొంతబుద్ధి ప్రసాదించాడు. బుద్ధిగల మనిషి కొక్క అనుభవం. నా అనుభవం నీది కాదా? నువ్వు కూడా నేనుపడ్డ గోతిలో పడాలా! మంత్రాలబలిమి యందు నాకు నమ్మకం చచ్చింది. నీ కింకా చావలేదా? భార్యాభర్తల ఇష్టా యిష్టాలతో, ఏమీ సంబంధం లేకుండా ఆజన్మాంతం ఇద్దర్నీ ఒకరికొకర్ని అంటగట్టటం పాపంగా తోచటం లేదా నీ కింకా? వూరికే తోచి యేం ప్రయోజనం? ఆచరణలోకి ఎప్పుడొస్తుంది? కీకారణ్యంగా వున్న యీ సంఘు చట్టాన్ని ఒక కొంపనించి బాగుచేసుకుంటూ ఎందుకు రాగూడదు మనం? ఎప్పటికయినా నందనవనం అవుతుం దేమో!

'మన పిల్లలకు కొత్తరకం వివాహం చేద్దాం. ఎందుకు చెయ్యకూడదు! ఆ వివాహాన్ని గురించి వివరాలు తరవాత రాస్తాను. ముందు ప్రస్తుత వివాహ చట్టంలో ఉన్న లోపా లేమిటో గమనించి వాటిని మనం సరిచేసుకుందాం.

'నీకూ, నాకూ ఇప్పుడు ప్రేమలో నమ్మకం లేదు. మనకు చిన్నతనంలో లేదా? అప్పుడు మన మనస్సుకు తృప్తి జరిగిందా? లేదు. ఎందువల్ల? మనం చేసుకోవలసిన పనులన్నీ ఎవరో చేశారు. మనమూ మన భార్యలూ ఇంకోరి సహాయం లేకుండా కలుసుకుంటే ఎంత ఆనందంగా వుండేది? వూహించుకో.

'తరవాత మన సంసారాలు చూడు. భార్యాభర్తలకు మొదట్లో పరస్పరాకర్షణ వున్నా, అది సొంతంగా పొయ్యే

దాకా, ఒకరిమీద ఒకరికి ఆసహ్యమేసేదాకా, చక్కగా సుఖమయంగా వుండవలసిన సంసారం కుళ్లుగుంట అయేదాకా భార్యాభర్తలు ఒకర్నిగురించొకరు తెలుసుకోగూడని విషయాలన్నీ తెలుసుకుంటారు. ఆపై నేముంది ? కొంచం ఝురిగల ఆడదిగాని మగవాడుకాని అయితే సంఘుచట్టాలన్నిటికీ తిరగబడటం, అతిక్రమించటం, అపఖ్యాతీ, లేకపోతే యీ మురికి గుంటలోనే మఃణగానాం తేలానాం.

'ఆమీద మగవాడు ఆడదానికందకుండా వృద్ధికావటం. పిల్లలు ఈ ఇద్దరిమధ్యా ఊగుతూండటం. ఎవరో చెప్పినట్టు ఆడవాళ్లు సంఘంలో చీట్ల పేకలో పొడిముక్కల్లే వున్నారు. వాళ్ళైవిధంగా అభివృద్ధి పొందటానికీ అవకాశం లేదు. యింకోసంగతి చూడు. అన్ని శక్తులూఉన్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి ? అసలు మగవాడికన్న ఆడదానికి అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరికయినా కననీకాక యే ఆడదానిపిల్లలు ఆ ఆడదాని పోషణలోనే వుండటం సహజం. నా పెద్దమ్మాయి కొద్దికాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్దచదువు చదివిస్తాను. అది నెలకు నూరూ నూటయాభై సంపాదిస్తే కాని నాకు తృప్తి వుండదు. నా స్వార్జితం ఇద్దరికీ పంచేస్తాను.

'మరో విషయం. మనిద్దరం ఒకరిమాటలు ఒకరు ఎట్లా అర్థం చేసుకుంటామో, నా పిల్ల మీ అబ్బాయిని అట్లా అర్థం చేసుకొంటుందని గ్యారంటీ యిస్తున్నాను. నా పిల్ల మీవాడి నెత్తిన బరువల్లే వుండదు. దాని నైతిక బాధ్యతలూ

ఆర్థిక బాధ్యతలూ మీవాడినెత్తిన వెయ్యాదు. ఇద్దరికీ ఎప్పు డభ్యంతరమైతే అప్పుడు విడిపోవచ్చును. ఒకర్ని గురించి ఒకరు అవసరమైనదానికన్న ఎక్కువ తెలుసుకోనక్కరలేదు. నిజంగా మన అనుభవంలోకి ఎన్నడూ రాని ప్రేమే వాళ్ళకు కలగటమే జరిగి, సామాన్య మానవుల్లేకాక, వాళ్ళు ఒకరి దార్బల్యమందు ఒకళ్లు సానుభూతే చూపగలిగితే వాళ్ళిద్దర్నీ భగవంతుడుకూడా ఎడబాపలేడు కదా, ఆలోచించు.

'ముఖ్యమయిన విషయం.ఇది చట్టంగాచేసి లోకానికి ఇవ్వాకుసుమా.ఎంతమంచిచట్టమయినాసరే, అవివేకులచేతుల్లో విషంగా మారుతుంది. లేకపోతే ఇప్పుడమల్లో వున్న చట్టా లన్నీ సంఘానికి పీడకలిగించాలని వుద్దేశించ బడ్డవా ?

'ప్రత్యక్షంగా అంతా మాట్లాడతాను.నీ క్షేమం...'

రామమూర్తి మీద నాకు గురేననండి, నాకు వాడి వాదన సమంజసంగా తోచటంచేతనే కానివ్వండి నేను వాడి ఏర్పాట్లన్నీ అంగీకరించాను. అప్పటికి మా అబ్బాయికి పదిహేడేళ్ళు, రామమూర్తి కూతురు పదమూడేళ్ళది. మరి మూడుసంవత్సరాలదాకా మేమేమీ చెయ్యదలచలేదు.

1927 మార్చిలో రామమూర్తి మా ఇంటిపక్క స్థలం వెయ్యిగజాలు కొని ఇల్లు కట్టాడు. అది తన చిన్న కూతురి కోసమే.

నేను మా అబ్బాయితోకాని రామమూర్తి తన పిల్లతోకాని ఏమీ చెప్పలేదు.

ఆ డిశంబరులో రామమూర్తి ఇద్దరు పిల్లలనూ తీసుకుని [భార్య రెండో పిల్ల పురటకల్లో పోయింది] కొత్త ఇంట్లో ప్రవేశించాడు. 'మూడు నెలలు శెలవుమీద వచ్చాను. అంతదాకా వుండిపోతాను. ఈలోపుగా ఏం కానుందో చూదాం' అన్నాడు రామమూర్తి. నేను సరేనన్నాను. మా వాడప్పటికి బి. ఎ పూర్తిచేసి ఇంటిదగ్గిరే వుంటున్నాడు.

రామమూర్తి రెండో కూతురు అందమైన పిల్లె. చాలా చొరవగలది కూడాను. పేరు అలివేణి. మావాడికీ దానికీ స్నేహముందంటే వీడుకాదు కారణం రామమూర్తి పెద్ద కుమార్తె సామాన్యంగా ఇల్లు కదిలేదికాదు.

రామమూర్తి తన తెలివంతా వినియోగించి మా పిల్లలిద్దరికి బాగా పరిచయం గలిగే అవకాశాలన్నీ యిచ్చాడు. సినిమాలకూ నాటకాలకూ మావాడివెంట అలివేణినిపంపిస్తూ వుండేవాడు మావాడు వాళ్ళింటికి-సామాన్యంగా వాళ్ళింటికొచ్చే వేళప్పుడు తను ఇంట్లో వుండేవాడు కాదు. పెద్దపిల్ల ఇంట్లోవున్నా లేనట్టే.

వీళ్ళకిటువంటి స్వేచ్ఛ ఇవ్వటం అపాయకరమేమో అనిపించేది మధ్య మధ్య నాకు. సాంప్రదాయం ఎక్కడికి పోతుంది?

కాలం గడిచినకొద్దీ ఈ స్నేహం మేం చూస్తుండగానే పెరిగిపోయింది. అలివేణి అస్తమానం మా వాడితో ఏదో రహస్యాలోచన చేస్తున్నట్టు గ్రహించాను. నా కర్థంకాలేదు. రామమూర్తితో చెబితే తనకర్థమైనట్టు సూచించాడు.

ఎందువల్లో నాకురోజులు గడుస్తున్నకొద్దీ ధైర్యం తగ్గటం మొదలుపెట్టింది. మొత్తానికి రామమూర్తి మొండిఘటం.

ఒకరోజు నేను దీపాలు పెట్టినతరవాత ఇంటికొస్తూ బజారులో ఒక బండిలో మావాడు అలివేణితో బండి ఎక్కి పోతూండటం చూశాను. బండిలో ఇద్దరూ కాక పెట్టెకూడా ఒకటుంది. నా కనుమానం కలిగింది. యే వూరైనా లేచి పోతున్నారా? ఎందుకు?

ఈ విషయమేమిటో కనుక్కుందామని నేను కూడా స్టేషను వైపున నడవటం మొదలుపెట్టాను. ఆ ఇద్దరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. వాళ్ళెక్కిన బండి స్టేషనుదగ్గిర కనిపించింది. నేను మెల్లిగా లోపలికి పోయి అటూ ఇటూ చూడటం మొదలుపెట్టాను వీళ్ళకోసం. ఆ గుంపులో ఇద్దరూ కనపడ్డారు. మావాడిచేతులో పెట్టె వుంది. అలివేణి చేతులో రెండు టిక్కెట్లున్నై. ఇద్దరూ బయటికి పోతున్నారు ప్లాటుఫారం మీదికి. ఇంతలో బండికూడా వచ్చింది.

నేను కూడా ప్లాటుఫారం టిక్కెట్టుకోసం కిటికీ దగ్గిరికి పోతే అప్పుడే బుకింగాఫీసరుగారూ ఎక్కడికో నిష్క్రమించాడు. ఆయనకోసం కేకలుపెట్టి ఎట్లాగయితేనేం ఆయనతో ఘర్షణచేసి టిక్కెట్టు తీసుకుని నేనుకూడా ప్లాటుఫారంమీదికి పొయ్యేటప్పటికి రైలు సాగింది. నేనొక్క అరనిమిషంసేపు దానివంక చూసి నిట్టూర్పు విడిచి వెనక్కు తిరిగేటప్పటికి 'నాన్నా!' అని పిలుపు వినబడ్డది. మావాడు. నాకేమీ అర్థంకాలేదు

"నువ్వుకూడా పోలేదేంరా ?" అన్నాను.

మా వా డాశ్చర్యంతో 'ఎక్కడికి?' అన్నాడు.

నాకుమాత్రం ఏం తెలుసు?

'అలివేణి ఏది?' అన్నాను.

మావాడు నవ్వి 'నీ కెలా తెలిసింది ?' అన్నాడు.

'ఏది అలివేణి?'

'నాగపూరు పోయింది'

నా కస లర్థం కా లేదు.

'ఎందుకు ?'

'పెళ్ళిచేసుకోటానికి. అక్కడ మెవడో వున్నాట్ట. వాడిదగ్గిర్నించి వుత్తరా లొచ్చేవి ఆ అమ్మాయికి. అంతా నాకు చెప్పింది. వాళ్ళ నాన్నకు చెప్పటానికి భయం. సరే నా చాతయిన సహాయం నే చేశాను.'

నేనేమీా మాట్లాడ లేదు. యేముంది మాటాడటానికి?